క్లుప్తంగా

నేడు సామూహిక సీమంతం

మధురపూడి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పుట్టిన రోజును పురస్కరించుకుని గురువారం కోరుకొండ మండలంలో వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. బూరుగుపూడి హెల్త్ సెంటర్ వద్ద సామూహిక సీమంతం జరుగుతుంది. అన్ని గ్రామాల్లో వేడుకలు జరుపుతారు.

శ్రీరామ అవతారంలో భజేనారాయణస్వామి



రామ అవతారంలో దర్శనమిస్తున్న శ్రీభజేనారాయణస్వామి

రంగంపేట: వడిశలేరు గ్రామంలో కొలువైఉన్న శ్రీదేవి-భూదేవి సమేత శ్రీభజేనారాయణ స్వామివారి దేవస్థానంలో ధనుర్మాసోత్సవాలను పురస్కరించుకుని దశావతారాల్లో భాగంగా బుధవారం స్వామివారిని శ్రీరామ అవతారంలో అలంకరించారు. ఆలయ అర్చకుడు చిలకమర్రి మురళీకృష్ణమాచార్యులు స్వామివారిని సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. గురువారం శ్రీకృష్ణ అవతారంలో స్వామివారు దర్శనమిస్తారని ఆలయ కార్య నిర్వాహక కార్యదర్శి ముమ్మన రాంబాబురెడ్డి తెలిపారు.

మహా గణపతి యాగం ప్రారంభం

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలు షష్ఠి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించే యాగాలు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అర్చకులు మహా గణపతి పూజ, పుణ్యాహవాచనం, ఆరాధన, మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. ఈ యాగాలు ఈ నెల 23 వరకు సాగుతాయని అర్చకులు తెలిపారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ జంగా మురళీకృష్ణారెడ్డి, బిక్కవోలు శ్రీలక్ష్మీ గణపతి ఆలయం అభివృద్ధి చైర్మన్ తమ్మిరెడ్డి నాగశ్రీనువాసరెడ్డి పాల్గొన్నారు.

పశువుల దాణా పంపిణీ



పశువుల దాణా అందిస్తున్న ఆర్బీకే చైర్మన్ వెంకట్రాజు

సీతానగరం: స్థానిక ఆర్బీకే వద్ద పాడి రైతులు, గొర్రైలు, మేకల పెంపకందారులకు బుధవారం పశువుల దాణాను పంపిణీ చేశారు. మండల ఆర్‌బీకే చైర్మన్ వలవల వెంకట్రాజు (తోటలో రాజు), ఎంపీటీసీలు వెన్నెల అప్పలనాయుడు, మట్ట నాగలక్ష్మి చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరిగింది. కోటి కేశవరం పశువైద్యుడు డాక్టర్ రాజశేఖర్, వీహెచ్ఎ సుధాకర్, మట్ట నాగేశ్వరరావు, తొరం బ్రహ్మాజీ పాల్గొన్నారు.

ఘనంగా గుమ్మళ్లదొడ్డి ఆచార్యుల శత జయంతి

గోకవరం: మండలంలోని గుమ్మళ్లదొడ్డి గ్రామానికి చెందిన ఆచార్య (ఎస్‌టీపీ తిరుమలాచార్య) శత జయంతి ఉత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈయన యజుర్వేద పండితులుగా సుప్రసిద్ధులు. 1960లో గ్రామానికి వచ్చిన ఆయన గ్రామంలోని శ్రీరామగిరి దేవాలయాన్ని ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దారు. ఈయన శిష్యులు అనేక దేవాలయాల్లో అర్చకత్వ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. సుమారు 35 ఏళ్ల పాటు శ్రీరామగిరి కొండపై దేవాలయం కైంకర్యాలు నిర్వహించారు. ఆయన ఆధ్వర్యంలో జిల్లాలోని అనేక దేవాలయాల్లో ధ్వజస్తంభ ప్రతిష్ఠలు, దేవతా మూర్తుల ప్రతిష్ఠలు జరిగాయి. ఆయన శత జయంతిని పురస్కరించుకుని వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన శిష్యులు, కుటుంబ సభ్యులు ఘనంగా పూజలు నిర్వహించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మధురపూడి: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి రాజమహేంద్రవరంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రాయుడుపాకలకు చెందిన చప్పిడి నాగేశ్వరరావు (62) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగేశ్వరరావు మంగళవారం మధ్యాహ్నం స్కూటర్‌పై కోరుకొండ వెళ్లి తిరిగి రాయుడుపాకలు వెళుతున్నాడు. కోరుకొండలోని ఆదిత్య కల్యాణ మండపం వద్ద వెనుక నుంచి వేగంగా వచ్చిన లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో తలకు బలమైన గాయాలైన ఆయనను రాజమహేంద్రవరంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ తెల్లవారుజామున మృతి చెందాడు.

సారా కేసులో వ్యక్తి అరెస్టు

రంగంపేట: సారా కేసులో వ్యక్తిని అరెస్టు చేసినట్టు ఎస్ఈబీ సీఐ జి.వెంకటలక్ష్మి తెలిపారు. బుధవారం రాత్రి ఆమె మాట్లాడుతూ మండల పరిధిలోని పెద్ద దొడ్డిగుంట గ్రామంలో తమ సిబ్బందితో తనిఖీలు చేయగా పంపన సత్తిబాబు 400 లీటర్ల బెల్లపుఊట, 20 లీటర్ల సారా కలిగి ఉండటంతో అతనిని అరెస్టు చేసి సారా తయారీకి ఉపయోగించే అల్యూమినియం పాత్రలు స్వాధీనం చేసుకున్నామన్నారు. సారా తయారీకి బెల్లం సరఫరా చేసిన పెద్దాపురం మండలం పులిమేరుకు చెందిన బర్రె రామకృష్ణ పై కేసు నమోదు చేసినట్టు తెలిపారు. ఈ దాడుల్లో సెబ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఏటిగట్టు.. బాగుంటే ఒట్టు..

- దారిని మూసేసిన తుప్పలు
- రాకపోకలకు తీవ్ర అవస్థలు



ఏటిగట్టుపై బొబ్బిల్లంక వద్ద పెరిగిన తుప్పలు

సీతానగరం: ఏటిగట్టు మార్గం తుప్పలతో మూసుకుపోయింది. ఆహ్లాదకర ప్రయాణం కాస్తా, ప్రమాదకరంగా మారింది. సీతానగరం నుంచి పురుషోత్త పట్నం వరకూ ఏటిగట్టు తారురోడ్డుగా బాగానే ఉన్నప్పటికీ, బొబ్బిల్లంక నుంచి సీతానగరం వరకూ కనీసం నడవడానికి కూడా వీలులేని విధంగా తయారైంది. దీంతో ఏటిగట్టును ఆనుకొని ఉన్న గ్రామాల వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాజమహేంద్రవరం – సీతానగరం ఆర్‌అండ్‌బీ రోడ్డు పదేళ్ల క్రితం ప్రయాణించడానికి వీలులేని విధంగా ధ్వంసమైనప్పుడు ఈ ఏటిగట్టు మార్గమే శరణ్యమైంది.

మూసుకు పోయిన దారి

ప్రస్తుతం ఏటిగట్టుపై ముళ్ల మొక్కలు విపరీతంగా పెరిగిపోయాయి. కాలినడక వెళ్లడానికి కూడా లేకుండా దారి మూసుకుపోయింది. సీతానగరం నుంచి పురుషోత్తపట్నం వరకూ ఏటిగట్టుపై తారురోడ్డు ఉన్నందున ఆర్టీసీ బస్సులు తిరుగుతుంటాయి. అలాగే పోలవరం ప్రాజెక్టు పనులకు భారీ వాహనాలు, పర్యాటకుల బస్సులు అధికంగానే రాకపోకలు సాగిస్తాయి. సీతానగరం, రఘుదేవపురం, ముగ్గళ్ల, రాజంపేట, వెదుళ్లపల్లి, ఇనుగంటివారిపేట, మునికూడలి, కాటవరం, జాలిమూడి, బొబ్బిల్లంక వరకు ఏటిగట్టును ఆనుకుని గ్రామాలు ఉన్నాయి.

పట్టించుకోని అధికారులు

పుష్కరాల సమయంలో ఏటిగట్టుపై ఉన్న తుప్పలను అఖండ గోదావరి లెఫ్ట్ బ్యాంక్ అధికారులు లస్కర్లతో తొలగించారు. పుష్కరాల అనంతరం అధికారులు ఏటిగట్టుపై కన్నెత్తి చూసిన దాఖలాలు లేవు. ఉన్న దారి కాస్తా మొక్కలతో మూసుకుపోయింది. కొంతమంది రైతులు ఏటిగట్టుపై పశువులను కట్టివేస్తున్నారు. గణపతి, దేవి నవరాత్ర మహోత్సవాలు, కార్తికమాసంలో అయ్యప్ప స్వాములు గోదావరిలో పుణ్యస్నానాలకు వెళుతుంటారు. ఏటిగట్టుపై తుప్పలు పెరగడంతో అవి విష సర్పాల సంచారం ఎక్కువైంది. సమీపంలోని నివాసాల్లోకి కూడా అవి ప్రవేశిస్తున్నాయి. అధికారులు స్పందించి ఏటిగట్టుపై పెరిగిన తుప్పలను తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సర్పాల సంచారం



ఏటిగట్టుపై ముళ్ల మొక్కలు, తుప్పలు పెరిగిపోయాయి. గట్టుపైకి వెళ్లడానికే భయంగా ఉంది. విష సర్పాలకు నిలయంగా మారింది. పుష్కరాల సమయంలో ఏటిగట్టుపై ఉన్న మొక్కలను లస్కర్లతో తొలగించారు. ఆ తర్వాత ఇంతవరకు పట్టించుకోలేదు.

– సొంబెలపు బాలయోగి, రఘుదేవపురం

తుప్పలను తొలగించాలి



గతంలో సీతానగరం – రాజమహేంద్రవరం ఆర్‌అండ్‌బీ రోడ్డు శిథిలమైనప్పుడు ఏటిగట్టుపై నుంచి వాహనాలు వెళ్లేవి. ఇప్పుడు ఏటిగట్టు కనిపించని రీతిలో ముళ్ల కంపలు, తుప్పలు పెరిగిపోయాయి. తుప్పలను సంబంధిత అధికారులు తక్షణమే తొలగించాలి.

– రుద్రం శ్రీనివాస్, ముగ్గళ్ల

ఉపాధి మేట్లకు శిక్షణ



గోకవరంలో శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధి మేట్లు

గోకవరం: ఉపాధి హామీ పథకంలో గోకవరం మండలానికి చెందిన మేట్లకు బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని 14 పంచాయతీలకు చెందిన 154 మంది మేట్లకు ఈ పథకంలో రాజీలేని అంశాలు, మస్టర్ నిర్వహణ, యాప్ ద్వారా హాజరు వేయడం, గ్రూపు నుంచి డిమాండ్ సేకరించడం, జాబ్ కార్డ్ అప్‌డేట్, పని ప్రదేశంలో సౌకర్యాల కల్పన, పనులకు కొలతలు ఎలా వేయాలన్న అంశాలపై శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కె.పద్మాజ్యోతి, ఏపీఓ పీఎస్ అప్పలరాజు, జేఈ ఏ.రత్నరాజు, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యస్వామి హుండీ ఆదాయం రూ.2,48,306

బిక్కవోలు: స్థానిక శ్రీ గోలింగేశ్వరస్వామి ఆలయంలో కొలువై ఉన్న కుమార సుబ్రహ్మణ్యం స్వామి వారి హుండీ ఆదాయం రూ.2,48,306 వచ్చిందని దేవదాయ ధర్మదాయ శాఖ రామచంద్రపురం ఇన్‌స్పెక్టర్ ఆర్.బాలాజీ రామ్‌ప్రసాద్ తెలిపారు. ఆయన బుధవారం తెలిపిన వివరాల ప్రకారం సుబ్రహ్మణ్యం స్వామి షష్ఠి సందర్భంగా ఈ నెల 13 నుంచి 19 వరకు గల స్వామి హుండీ ఆదాయం లెక్కించారన్నారు. ఈఓ ఎం.రాంబాబురెడ్డి, ఉత్సవ కమిటీ ప్రతినిధులు తమ్మిరెడ్డి, నాగ శ్రీనివాసురెడ్డి, యామసాని రవీంద్రపాపారెడ్డి పాల్గొన్నారు.

పందిరి మహాదేవుడు వర్ధంతి

ప్రకాశం నగర్: కోటిలింగాలపేటలోని పందిరి మహాదేవుడు కోటిలింగాల సత్రం వ్యవస్థాపకుడు పందిరి మహాదేవుడు వర్ధంతిని బుధవారం సత్రం ప్రాంగణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ మహాదేవుడి ఆశయాలను ముందుకు తీసుకువెళుతూ, పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్న దేవదాయశాఖ సేవలను కొనియాడారు. అనంతరం పేదలకు దుపట్లు పంపిణీ చేశారు. సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి వీవీ పళ్లంరాజు అధ్యక్షత వహించారు. వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, ఉమా కోటిలింగేశ్వర దేవస్థానం చైర్మన్ ఏబీఎస్ ప్రసాద్, సంకిస భవానీ ప్రియ, మర్రి దుర్గా శ్రీనివాస్, సురేష్, వానపల్లి శ్రీనివాస్, కనకదుర్గ పాల్గొన్నారు.

నేడు దివ్యాంగుల ఉపకరణాల నమోదు శిబిరం

రాజమహేంద్రవరం సిటీ: ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా ఎంపీ మార్గాని భరత్ రామ్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక మార్గాని ఎస్టేట్స్‌లో దివ్యాంగుల ఉపకరణాల నమోదు శిబిరం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు ముత్యాల పోసి కుమార్ తెలిపారు. ఆయన బుధవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడుతూ బ్యాటరీ ట్రై సైకిళ్లు, ట్రై సైకిళ్లు, వీల్ చైర్లు, బ్లైండ్ స్టిక్కులు, తదితర ఉపకారణాల కోసం దివ్యాంగులు వివరాలు నమోదు చేసుకోవాలన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



కోటికేశవరంలో జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు



సూర్యారావుపేటలో మాట్లాడుతున్న నాయకులు

మధురపూడి: పేదల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని కోరుకొండ జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు అన్నారు. కోరుకొండ మండలం కోటికేశవరంలో బుధవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జెడ్పీటీసీ నాగేశ్వరరావు మాట్లాడుతూ జగన్ ప్రభుత్వంలో కోటికేశవరం గ్రామాభివృద్ధికి రూ. 7.50 కోట్లు, సంక్షేమ కార్యక్రమాలకు రూ.20.50 కోట్లను ప్రభుత్వం ఖర్చు చేసిందన్నారు. తొలుత వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ అడపా కనకరాజు, నాయకులు తాడి హరిశ్చంద్రప్రసాద్ రెడ్డి, సర్పంచ్ ముడే సింధూదివ్య, రాంబాబు, బుజ్జి, ముడే కామేష్ పాల్గొన్నారు.

సూర్యారావుపేటలో..

రాజానగరం: ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చి, ఆదర్శంగా నిలిచిన జగన్ సర్కారు మరోసారి అధికారంలోకి రావాలని, ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి ఉండాలని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దూలం పెద్ద, మాజీ కన్వీనర్ మండారపు వీర్రాజు, సీనియర్ నాయకుడు గంగిశెట్టి సోమేశ్వరరావు అన్నారు. మండలంలోని సూర్యారావుపేట సచివాలయం వద్ద బుధవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ కుందేటి ప్రసాద్, ఉప సర్పంచ్ కొల్లి వీర్రాజు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు రాపాక మోషే మాట్లాడుతూ గత ఎన్నికలలో ఇచ్చిన హామీలలో 99.5 శాతం వరకూ జగన్ నెరవేర్చారన్నారు. అదే గతంలో చంద్రబాబు 650 హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తరువాత వాటన్నిటినీ తుంగలో తొక్కిన విషయాన్ని ప్రజలు మరువరాదన్నారు. పంచాయతీ కార్యదర్శి మేకా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ స్మార్ట్ కార్డుల పంపిణీ



రంగంపేట పీహెచ్‌సీలో ఆరోగ్యశ్రీ స్మార్ట్‌కార్డులతో లబ్ధిదారులు

రంగంపేట: డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంలో కొత్తగా రూపొందించిన స్మార్ట్‌కార్డులను పంపిణీ బుధవారం స్థానిక పీహెచ్‌సీలో ప్రజా ప్రతినిధులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి వేణుశ్రీలక్ష్మి మాట్లాడుతూ గతంలో 1,059 చికిత్సలు మాత్రమే ఆరోగ్యశ్రీ పరిధిలో ఉండగా ప్రస్తుతం 3,257 వ్యాధులను జాబితాలో ప్రభుత్వం చేర్చిందన్నారు. రూ.5 లక్షల పరిమితిని రూ.25 లక్షలకు పెంచారన్నారు. ఆరోగ్యశ్రీ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడానికి ప్రభుత్వం యాప్‌ను రూపొందించిందన్నారు. ఏఎన్ఎంలు, ఆశాలు, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ఆరోగ్యశ్రీ స్మార్ట్ కార్డులు పంపిణీ చేస్తారని తెలిపారు. జెడ్పీటీసీ సభ్యుడు పి.రాంబాబు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర రైతు, చేనేత విభాగాల కార్యదర్శులు రిమ్మలపూడి వెంకటేశ్వరరావు, పాలాటి నాగేశ్వరరావు, అనపర్తి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అడబాల వెంకటేశ్వరరావు, మండల జేసీఎస్ కన్వీనర్ మేడిశెట్టి రవిశంకర్, పీహెచ్‌సీ డాక్టర్ కె.చిన్నారావు, సీహెచ్ఓ కె.జయమణి పాల్గొన్నారు.

నిధుల విడుదలకు వినతి



వినతి పత్రం అందజేస్తున్న పెదపూడి మండల సర్పంచులు

పెదపూడి: రిజిస్ట్రార్ ఆఫీసు నుంచి స్టాంపు డ్యూటీ ద్వారా గ్రామ పంచాయతీలకు రావలసిన నిధులను గ్రామ పంచాయతీలకు విడుదల చేయాలని పెదపూడి మండల సర్పంచులు కోరారు. ఈ మేరకు మండలంలోని 18 గ్రామాల సర్పంచులు కాకినాడ జిల్లా రిజిస్ట్రార్‌కు బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు సర్పంచులు మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి సంబంధించి ప్రభుత్వం నుంచి విడుదలయ్యే 15వ ఆర్థిక సంఘం నిధులతో గ్రామాలను అభివృద్ధి చేస్తున్నామన్నారు. అయితే గతంలో విద్యుత్, ఇతర బకాయిలు ఎక్కువగా ఉండటంతో గ్రామ పంచాయతీలు ముందుకు సాగడం లేదన్నారు. పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితుల్లో గ్రామ పంచాయతీలు ఉన్నాయన్నారు. ఈ నేపథ్యంలో స్టాంపు డ్యూటీ నిధులు గ్రామ పంచాయతీలకు విడుదల చేయాలని కోరుతున్నామన్నారు. నియోజకవర్గ సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు కొటికలపూడి చినబాబు, సర్పంచులు నూని పట్టాభిరామన్న చౌదరి, వుండ్రు చంద్రకళ, మీనవల్లి శారదాదేవి, గుత్తుల పుష్పవతి, డొకుబుర్ర మీనాక్షి, కుడిపూడి మాధవీలత పాల్గొన్నారు.

లింగ వివక్షను అరికట్టాలి



సదస్సులో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి ప్రత్యూష కుమారి

రాజానగరం: సామాజిక పురోగతి కోసం లింగ వివక్షను పూర్తి స్థాయిలో అరికట్టాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి అన్నారు. సంస్థ ఆధ్వర్యంలో స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయం వద్ద లింగ వివక్షతకు వ్యతిరేకంగా 'నయీ చేతనా' కార్యక్రమం బుధవారం జరిగింది. పురుషులు, స్త్రీలు, ట్రాన్స్‌జెండర్లు అందరికీ సమాన హక్కులు, అవకాశాలున్నాయన్నారు. అయితే లింగ వివక్ష కారణంగా చాలామంది ఆ అవకాశాలు పొందలేకపోతున్నారన్నారు. అటువంటి వారు తమ హక్కుల పట్ల అవగాహనను పెంచుకుని, వాటిని పరిరక్షించుకునేందుకు పోరాడాలన్నారు. బలహీనులకు సాయమందించేందుకు తమ సంస్థ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందన్నారు. గృహహింస, పోక్సో, వరకట్న నిషేధం చట్టాలపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణ పేదరిక నిర్మూలనా సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ వై.జనార్దనరావు పాల్గొన్నారు.

పేదల మేలు కోసం అడుగులు

కడియం: సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన నాటి నుంచీ రాష్ట్రంలో పేదల మేలు కోసమే అడుగులు వేస్తున్నారని మండల జేసీఎస్ కన్వీనర్ తాడాల విష్ణుచక్రవర్తి అన్నారు. వేమగిరి సచివాలయం 2లో బుధవారం వై ఏపీ నీడ్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంక్షేమ పథకాల బోర్డును, పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ఈవోపీఆర్‌డీ వీవీఎస్ఎస్ లక్ష్మి, పంచాయతీ కార్యదర్శి కె.రాజశేఖర్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల ప్రదాత జగన్

ధవళేశ్వరం: సంక్షేమ పథకాల ప్రదాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని మండల జేసీఎస్ ఇన్‌చార్జ్ తాటికొండ విష్ణుమూర్తి పేర్కొన్నారు. పిడింగొయ్యి గ్రామ సచివాలయం–3లో బుధవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. అభివృద్ధి పథకాల డిజిటల్ బోర్డును ఆవిష్కరించారు. ఈవోపీఆర్‌డీ కృష్ణ,పంచాయతీ కార్యదర్శి రూప్‌చంద్, హుకుంపేట సొసైటీ అధ్యక్షుడు బొప్పన సుబ్బారావు, సచివాలయ కన్వీనర్లు ఇబ్రహీం, పల్లి అనిల్, కంతి లక్ష్మీనారాయణ, వైఎస్సార్ సీపీ నాయకులు పడాల వీరరాఘవరెడ్డి, సిరసపల్లి శంకర్, పిల్లా లక్ష్మణరావు, ముప్పిడి రామారావు పాల్గొన్నారు.

బ్రిడ్జ్ కోర్సుకు దరఖాస్తులు

ధవళేశ్వరం: పాలిటెక్నిక్ డిప్లొమోలో నేరుగా రెండో సంవత్సరంలో చేరేందుకు ప్రవేశ పరీక్ష కోసం నిర్వహించే బ్రిడ్జ్ కోర్సుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ పి.పరమేశ్వరరావు తెలిపారు. ఐటీఐలో రెండేళ్ల కోర్సు ఉత్తీర్ణులైనవారు అర్హులన్నారు. ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథమెటిక్స్ తదితర సబ్జెక్టులకు సంబంధించి జనవరి 2 నుంచి 31 వరకూ ప్రభుత్వ ఐటీఐలో ఉచితంగా శిక్షణ ఇస్తామన్నారు. బ్రిడ్జ్ కోర్సు ప్రాక్టికల్స్ ఫిబ్రవరి 1 నుంచి 3 వరకూ నిర్వహిస్తామన్నారు.

ఆలస్యానికి తప్పదు మూల్యం!



మండలంలోని పందలపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు విద్యార్థులు బుధవారం అసెంబ్లీ సమయానికి రాకపోవడంతో గేటు బయట నిలిపేశారు. 9 నుంచి 9.15 గంటల వరకు సాగిన అసెంబ్లీ అనంతరం లోపలకు అనుమతించారు. - బిక్కవోలు

విదేశీ విద్యాదీవెనతో ఉజ్వల భవిష్యత్తు

- కలెక్టర్ మాధవీలత
- జిల్లాలో నలుగురు విద్యార్థులకు రూ.39.34 లక్షలు మంజూరు



నమూనా చెక్కు అందజేస్తున్న కలెక్టర్ మాధవీలత, కమిషనర్ దినేష్‌కుమార్

రాజమహేంద్రవరం సిటీ: విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు జగనన్న విదేశీ విద్యా దీవెన పథకం ఎంతో తోడ్పడుతోందని కలెక్టర్ మాధవీలత అన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహనరెడ్డి బుధవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి వర్చువల్ విధానంలో జగనన్న విదేశీ విద్యాదీవెన, జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహక నిధులను బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా జమ చేశారు. స్థానిక కలెక్టర్ కార్యాలయ వీడియో సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా స్థాయి కార్యక్రమంలో కలెక్టర్ మాధవీలత, జాయింట్ ఎన్.తేజ్ భరత్, కార్పొరేషన్ కమిషనర్ కె.దినేష్ కుమార్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

విద్యార్థుల తల్లుల ఖాతాకు జమ

కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ జగనన్న విదేశీ విద్యా దీవెన కింద జిల్లాలోని ఎస్సీ, మైనారిటీ, ఈబీసీలకు చెందిన నలుగురు విద్యార్థులకు మొదటి, రెండవ విడతగా రూ.39,33,582 రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాలకు జమ చేసిందన్నారు. జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహకంగా సివిల్ ప్రిలిమినరీ పాసైన విద్యార్థులకు రూ.లక్ష, మెయిన్స్ పరీక్షలో ఉత్తీర్ణులైతే అదనంగా మరో రూ.50 వేల ప్రోత్సాహకాన్ని ప్రభుత్వం అందిస్తోందని కలెక్టర్ మాధవీలత తెలిపారు.

26 నుంచి ఆడుదాం ఆంధ్ర

రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 26 నుంచి ప్రతిష్టాత్మకంగా ప్రారంభిస్తున్న ఆడుదాం ఆంధ్ర క్రీడాపోటీలను విజయవంతం చేయాలని కలెక్టర్ మాధవీలత అన్నారు. ఈ పోటీల నిర్వహణపై బుధవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం మండల స్థాయి అధికారులకు కలెక్టర్ మాధవీలత దిశానిర్దేశం చేశారు. ఆడుదాం ఆంధ్ర పోటీలు ఈనెల 26 నుంచి ఫిబ్రవరి 10 వరకూ జరుగుతాయన్నారు.

5న ఓటర్ల తుది జాబితా విడుదల

మార్పులు, చేర్పుల అనంతరం 2024 జనవరి 5వ తేదీన తుది ఓటర్ల జాబితా ప్రచురిస్తామని కలెక్టర్ మాధవీలత తెలిపారు. దానిని రాజకీయ పార్టీలకు అందజేస్తామని, ఏదైనా అభ్యంతరాలు వ్యక్తం చేస్తే వాటిని పరిష్కరించడం జరుగుతుందన్నారు. బుధవారం తన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు.

రేషన్ పంపిణీపై మరింత పర్యవేక్షణ

జిల్లా వ్యాప్తంగా జనవరి ఒకటి నుంచి రేషన్ సరకుల పంపిణీపై మరింత పర్యవేక్షణ చేపట్టనున్నట్టు కలెక్టర్ మాధవీలత, జేసీ తేజ్ భరత్ తెలిపారు. ఈ మేరకు బుధవారం మండలస్థాయి అధికారులతో సమీక్షించారు. వారు మాట్లాడుతూ రేషన్ వాహనం ఏరోజు ఎందరికి నిత్యావసరాలు పంపిణీ చేసిందో వలంటీర్లు డేటా అప్లోడ్ చేయాలన్నారు. రెవెన్యూ, పంచాయతీ రాజ్ అధికారులు తప్పనిసరిగా రేషన్ వాహనాలను తనిఖీ చేయాల్సి ఉందన్నారు. మిచాంగ్ తుపాను కారణంగా అధిక వర్షపాతం నమోదైనా, ఎటువంటి ఇబ్బందులూ లేకుండా ధాన్యం సేకరణ జరిగిందన్నారు. ఇప్పటి వరకూ 1,91,252 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించినట్టు తెలిపారు. జిల్లాలో 97 శాతం ధాన్యం కోతలు పూర్తయ్యాయన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం సందర్శన

అంగన్‌వాడీ కేంద్రాలకు పిల్లలు వందశాతం హాజరయ్యేలా సిబ్బంది చూపాలని, క్షేత్రస్థాయిలో ఆ పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత అన్నారు. అన్నపూర్ణమ్మపేటలోని ఆరో నంబర్ అంగన్‌వాడీ కేంద్రాన్ని గురువారం ఆమె సందర్శించారు.

నిత్యావసరాల పంపిణీ

ప్రకాశం నగర్: ప్రముఖ రంగస్థల నటుడు, బాబూ స్టూడియో వ్యవస్థాపకుడు మునిని బాబూరావు ఐదో వర్ధంతిని బుధవారం కోటగుమ్మం బాబూ స్టూడియో వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కుమారుడు, విశ్వనాథ్ ధర్మ ప్రచార సేవాసంస్థ అధ్యక్షుడు మునిని విశ్వేశ్వరరావు మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. బాబూరావు ఫొటోగ్రాఫర్‌గా రాణించారని, రంగస్థల నటుడిగా విభిన్న పాత్రలు పోషించి మెప్పించారని గుర్తు చేశారు. నాటక ప్రదర్శనల ద్వారా వచ్చిన పారితోషికాన్ని జీవకారుణ్య సంఘం అభివృద్ధికి ఇచ్చేవారన్నారు. ఈ సందర్భంగా పది మంది పేద కుటుంబాలకు నెల రోజులకు సరిపడా కిరాణా సరకులు, బియ్యం పంపిణీ చేశారు. కార్యక్రమంలో నగర శెట్టి బలిజ, గౌడ సంఘం అధ్యక్షుడు రెడ్డి రాజు, కోశాధికారి గెద్దాడ హరిబాబు, నగర టీడీపీ అధ్యక్షుడు రెడ్డి మణి, మునిని బాబులు, ఆంధ్ర కేసరి యువజన సమితి అధ్యక్షుడు దేశిరెడ్డి బలరాం నాయుడు, ఇన్నీసుపేట కోఆపరేటివ్ బ్యాంకు ఉపాధ్యక్షుడు గేడి అన్నపూర్ణ రాజు, గద్దే భగవాన్, వినియోగదారుల కోర్టు జడ్జి రాయుడు శ్రీనివాస రాజు పాల్గొన్నారు.